# ప్రేమ-పెళ్ళి

— శ్రీ పత్య

మెల్లిగా నడుస్తున్నాము మూర్తీ నేను.

తలెత్తి మూర్తికేసి చూశాను ఏదో ఆలోచిస్తున్నాడు దీర్ఘంగా. అత న్నేదో ప్రశ్నించబోయి అతని ఆలోచనకు భంగము కలుగుతుందేమోనని ఆగాను.

మూర్తీ, నేనూ ఒకే ఆఫీసులో పనిచేస్తున్నాము అతను ఈ మధ్యనే ఉద్యోగంలో చేరాడు. చేరిన నెలలోపలే స్నేహితుడయాడు నాకు స్నేహితులమనేకాని, మాలో ఒకరి వ్యక్తిగత విషయాలు ఒకరు చెప్పుకునేంత స్నేహము ఇంకా ఏర్పడలేదు.

అందుకనే ధైర్యంగా "ఏమిటోయ్ నీకు వచ్చిన సమస్య? నాకు చెప్పు. నేనేమైనా సాల్వ్ చేయగలనేమో," అని అనలేక పోయాను. అతన్ని అంతగా కుంగదీస్తున్న విషయము వ్యక్తిగతము కావచ్చు లేదా కుటుంబ సమస్య కావచ్చు. అడిగి చిన్న బోవటము నాకు ఇష్టములేదు

ఉన్నట్టుండి అన్నాడు మూర్తి — "అలా పార్కుకేసి వెళదామోయ్."

అలాగేనన్నట్టు తలాడించాను. నెమ్మదిగా పార్కు చేరుకుని పచ్చికమీద కూర్చున్నాము.

మొన్నటి నుంచి చూస్తున్నాను, ఏదో ఆలోచిస్తున్నట్టున్నావు. ఆఫీసులో కూడా సరిగా పని చేసినట్టు లేదు" — గడ్డిపరకలు తుంపుతూ అన్నాను అతనికేసి చూస్తూ.

అదే చెపుదా మనుకుంటున్నానోయ్." అన్నాడు మూర్తి.

కాసేపాగి — "మా అమ్మా నాన్నలకు మేము ఏడుగురము సంతానము. అందులో పెద్దవాడినవటము నా దురదృష్టము" అన్నాడు.

నేనేమి మాట్లాడలేదు. అతని ముఖము లోకి చూస్తూ చెప్పేది వింటున్నాను.

"నా తర్వాత వరుసగా నలుగురు ఆడ పిల్లలు. ఆ తరువాత ఇద్దరు మగపిల్లలు".

తలూపాను.

"ఇప్పుడు ఇద్దరు చెల్లెళ్ళు పెళ్ళికెదిగి ఉన్నారు వాళ్ళకు పెళ్ళి చేసే తహతు మా నాన్నకులేదు ఇంటికి పెద్దకొడుకు నైనందువల్ల ఆ బాధ్యత నామీద పడింది"

ఇంకా అతను ఉద్యోగములో చేరి ఆరు నెలలు కాలేదు అప్పుడే అతని నెత్తిమీద బరువు బాధ్యతలు ; బారేసింది అతనిమీద.

ఈ రోజుల్లో ఒక్క ఆడపిల్ల పెళ్ళి కావా లంటే మాటలు కాదు. కట్నాలు కానుకలు మొదలైన వెన్నో పెట్టాలి. నిన్న, మొన్న ఉద్యోగంలో చేరిన అతనికి అవన్నీ ఎలా సాధ్యం?

"మి నాన్నకులేని తాహతు నిన్న మొన్న ఉద్యోగంలో చేరిన నీకెలా వుంటుంది?" ప్రశ్నించాను అతనికేసి చూస్తూ.

"అందుకు మార్గం వాళ్ళే సూచించారు. నాకు పెళ్ళిచేసి వచ్చిన కట్నంతో ఇద్దరి చెల్లెళ్ళ పెళ్ళి జరిపిస్తారట" కాస్త ఆపే

శంగా అన్నట్టు అనిపించింది. అంటే అతనికి కట్నము తీసుకోవటము ఇష్టము లేదా?

నేనేమీ మాట్లాడలేను.

చాలామందికి కట్నము తీసుకుని పెళ్ళి చేసుకోవటము ఇష్టము ఉండదు. కానీ, మనము కట్నము తీసుకోకుండా పెళ్ళి చేసుకున్నంత మాత్రాన మన చెల్లెళ్ళ పెళ్ళిళ్ళ కట్నం ఇవ్వకుండా అవవుసరి!

ఆ మాటే అతనితో అన్నాను.

తలెత్తి నా వైపుచూస్తూ —

"నెలరోజుల క్రితం సినిమాకి నాతోపాటు ఒక అమ్మాయి వచ్చింది. ఆ సినిమాకే నువ్వూ వచ్చావు. గుర్తుందా?" అన్నాడు.

తలూపాను.

లీలామహల్‌లో "బెన్‌హర్" కి వెళ్ళినప్పుడు ఒకామెతో కలిసి వచ్చాడు మూర్తి. ఇంటర్వెల్‌లో గుర్తుపట్టి పలకరింపుగా నవ్వాడు. అంతేకానీ ఆమె ఎవరో పరిచయం చెయ్యలేదు.

"ఆమె పేరు శకుంతల. నేను యస్సెల్సీ నుంచి డిగ్రీ పాసయ్యేదాకా మా మామయ్యగారింట్లో ఉంటూ చదువుకున్నాను. మామయ్యగారింటి ఎదురుగా దశరథ రామయ్యగారని ఓ స్కూల్ మాష్టరుండేవారు. వాళ్ళ అమ్మాయే శకుంతల." అంటూ ఆగాడు.

అతనికేసి చూస్తూ చెప్పేది వింటున్నాను.

"నేను వాళ్ళింట్లో మనిషి లాగా నే మసిలేవాణ్ణి అవన్నీ చెప్పి నిన్ను విసిగించ తలచుకోలేను. కొన్ని సంఘటనలు శకుంతలనూ నన్నూ దగ్గరకు చేర్చాయి. మా ఇద్దరి మధ్య ఓ విధమయిన ఆరాధన, ఆకర్షణ ఏర్పడ్డాయి. ఎంతగా ఏర్పడినాయంటే ఇరువురము ఒకరి నొకరు చూచుకోకుండా ఒక్క క్షణము కూడా ఉండ లేని స్థితికి తెచ్చాయి. అయితే మేమేనాడూ హద్దులు మీరలేదు.

ఒక రోజు ఇంట్లో ఎవరూలేరు ఆ రోజు నాకు బాగా గుర్తుంది. "ఒకవేళ నేను నిన్ను విడిచి ఇంకొకర్ని పెళ్ళి చేసుకుంటే ఏం చేస్తావు?" అన్నాను నవ్వుతూ శకుంతలతో.

"నన్ను విడచి నువ్వు ఒక్క క్షణమున్నా ఉండలేవు. ఆ సంగతి నాకు బాగా తెలుసు. అలాంటిది నన్ను విడిచి ఇంకొకర్ని ఎలా పెళ్ళి చేసుకోగలవు? ఒక వేళ చేసుకుంటే అప్పుడు చెపుతాను" అన్నది శకుంతల కూడా నవ్వుతూనే. కానీ, ఆమె కళ్ళల్లో నీళ్ళు నిండటము నాకు ఇంకా గుర్తుంది." అంటూ ఆగాడు.

"మరి ఈ విషయము మీ వాళ్ళకు చెప్పలేదా?" ప్రశ్నించాను.

"చెప్పాను. తోడబుట్టిన చెల్లెళ్ళకన్నా మధ్యలో వచ్చిన అది నీకు ముఖ్యమా? నీ ఇష్టము వచ్చినట్టుచెయ్యి. అయితే నీ చెల్లెళ్ళ భవిష్యత్తు దృష్టిలో ఉంచుకో. అన్నారు." తలవంచుకుని చెప్పాడు మూర్తి.

"ఏం చేయాలో పాలు పోవటం లేదు సలహా ఏమన్నా చెప్పవోయ్" అన్నాడు మూర్తి నాకేసి చూస్తూ.

ఏమని సలహా ఇవ్వగలను? అలాంటి పరిస్థితిలో నేనింతవరకు చిక్కుకోలేదు. మనస్ఫూర్తిగా ప్రేమించిన శకుంతలను ప్రేమకు ప్రాధాన్యత ఇచ్చి వివాహము చేసుకోమంటే—

కనిపెంచిన తలిదండ్రులు కొడుకు వృద్ధిలోకివచ్చి సంసారాన్ని తీర్చిదిద్దుతాడని, తమకు అండగా నిలుస్తాడని అనుకున్న వాళ్ళ ఆశలు అడియాశ లవుతాయి. కట్నాలు ఇవ్వకపోతే ఆడపిల్లల పెళ్ళిళ్ళు జరగవు. పెళ్ళిచేయనంత మాత్రాన ఎదిగేవయసుతో పాటు కోరికలు పెరగకుండా ఉంటాయా? ఆ కోరికలు తీర్చుకునేందుకు వారు తప్పు

దాని లోకొస్తే, వారిజీవితాలు ఏమవుతాయి?

ఆ పైన ఇక ఆలోచించటానికి భయము వేసింది

తలిదండ్రుల మాట ప్రకారము వాళ్ళు నిర్ణయించిన అమ్మాయిని చేసుకోకుంటే —

అతని నూరేళ్ళ జీవితంలో ఇంతవరకు జరిగిన పాపులంతా తెలిసీ తెలియని వయసు. జీవితమంతా అనుభవించాల్సిన ఆనందం. మాధుర్యమంతా ముందే ఉన్నది. ప్రేమానురాగాలులేని దాంపత్య జీవితమునాన్న నరకమేముంటుంది?

"నాకీ ఆలోచన రావటంలేదోయ్. రెండూ ముఖ్యమయినవే. దీనికి వేరొకరు సలహా చెప్పలేరు వ్యక్తిగతంగా నువ్వే నిర్ణయించుకోవాలి' అన్నాను అతనికేసి చూస్తూ.

అతనేమీ మాట్లాడలేదు

కాసేపు గడిచాక "ఇకలేద్దాం' అన్నాడు.

అలాగేనంటూ లేచాను.

ఆ తర్వాత అతని పెళ్ళి గురించి నేనేమీ ప్రశ్నించలేదు తర్వాత నెలలోపలే నాకు హైదరాబాద్ ట్రాన్స్‌ఫరు కావటముతో వెళ్ళిపోయాను

* * *

రెండేళ్ళు గడిచాయి.

ఓ రోజు ఆఫీసు పనిమీద విజయవాడ వచ్చాను. ఏలూరు రోడ్డులో కాఫీ తాగుతుండగా కనిపించాడు మూర్తి.

పరామర్శలు అయినాక అన్నాడు మూర్తి "ఈ రాత్రికి ఉంటావా? వెళ్ళిపోతావా?"

"లేదోయ్ వెళ్ళాలి అన్నాను.

కాఫీతాగి బయటికి వచ్చాము.

మూర్తిని చూసిన దగ్గర నుంచి అతని పెళ్ళి విషయము ఏమైందో అడగాలని కుతూహలంగా ఉన్నది. కాని ఎలా మొదలు పెట్టాలో తెలియటము లేదు చివరికి —

"పిల్లలా నీకు?" అన్నాను.

ఓ సారి తల్లెత్తి నా వైపు చూసి నవ్వాడు. "లేరు".

"ఎక్కడా ఉంటటము?" అన్నాను.

"సూర్యారావు పేటలో. నీ ప్రయాణానికి ఇంకా టైముందిగా. ఓ సారి ఇంటికి వెళ్ళి వద్దాం' అన్నాడు మూర్తి


"అలాగే" నంటూ బయలు దేరాను.

అతని పెళ్ళి విషయము చెప్పటము మొదలు పెట్టాడు మూర్తి. మౌనంగా వింటున్నాను. మొత్తము మీద అతను చెప్పిన విషయము వాళ్ళ అమ్మా నాన్నా చెప్పిన పిల్లనే చేసుకున్నాడట. పెళ్ళయి ఏడాదిన్నర దాటింది.

"ఇదే ఇల్లు" అంటూ లోపలికి నడిచాడు. అతని వెంటే నేను ప్రవేశించాను. వరండాలో ఉన్న కుర్చీ చూపిస్తూ కూర్చో ఇప్పుడే వస్తాను" అంటూ లోపలికి వెళ్ళాడు.

కూర్చుని రోడ్డుమీద పోతున్న జనాన్ని చూస్తున్నాను. కొంతసేపు గడిచాక లోపలి నుంచి మాటలు వినిపించాయి.

"ఏమన్నా అంటే కొడతాను అంటేగా? చేసుకున్న దగ్గర్నుంచి సుఖపెట్టేది లేకపోయినా, ఏదో వంక పెట్టుకుని కొట్టటము అలవాటు చేసుకున్నారు.... మా వాళ్ళు నన్నో బండ రాయికిచ్చి చేసి నా గొంతు



# తీరం చేరని అలలు

— వైదేహి

తీరం చేరని అలలు.
కథలుగా ముగిసిన కలలు.
మాటల కందని ఊహలు,
ఊహలై నిలచిన ఆశలు,
ఆశను గొలిపే తలపులు,
అవి తలచుకుంటేనే బాధ
ముగిసింది తుదకు గాథ।

కోశారు....' అంటుందో ఆడగొంతు

అంతే। ఎవరినో గుద్దుతున్న చప్పుడు. వెంటనే కొంచెము పెద్దస్వరములో ఏడుపు వినిపించింది.

"నోరుమూసుకుని పడి ఉండగలిగితే ఉండు. అనవసరంగా నన్ను రెచ్చగొట్టకు. ఇక్కడే ఉండటమునకు అంతయిష్టముగా ఉంటే మీ పుట్టింటికిపో," ఆ గొంతు గుర్తించాను మూర్తిది. ఆడగొంతు అతని భార్య కావచ్చు.

వాళ్ళమాటలు చూస్తే అన్యోన్యంగా కాపురము చేయటములేదన్న విషయము స్పష్టముగా అర్థమవుతుంది. అంటే మూర్తి ఇంకా శకుంతలను మరచిపోలేదన్నమాట

ఇంతలో బయటకి వచ్చాడు మూర్తి.

"సారీనోయ్. ఆవిడకు ఒంట్లో కులాసాగాలేదు మరోసారి చూపిస్తాను" అంటూ బయటకు దారితీశాడు.

మెల్లిగా నడుస్తున్నాము

తలెత్తి మూర్తికేసి చూశాను చేతులు వెనక ఉంచుకుని తదేకంగా రోడ్డుని చూస్తూ నడుస్తున్నాడు మూర్తి.

"ఇంకా నువ్వు శకుంతలను మరచిపోలేదన్నమాట." అన్నాను.

"మరచిపోతానని ఎందుకనుకున్నావు?" అన్నాడు మూర్తి.

"మరచిపోతావనుకోలేదు కాని, చేసుకున్న భార్యని సుఖపెట్టలేనంత బాగా గుర్తుంచుకున్నావనుకోలేదు."

నవ్వాడు మూర్తి. "అయితే లోపల జరిగిందంతా విన్నావన్నమాట."

"వినలేదు. అవే వినపడ్డాయి. ఏమైనా నువ్వలా ప్రవర్తించటము బాగాలేదోయ్. నువ్వామెను ఎందుకు పెళ్ళిచేసుకున్నావో నాకు తెలుసు కట్నము ప్రసక్తే లేకపోతే ఆ స్థానములో శకుంతల వుండేది. కాని ఈమె ఇప్పుడు నీ భార్య. ఆమెకీ మనసనేది వుంటుందనీ, కోరికలుంటాయని భర్తగా అవి తీర్చే బాధ్యత నీదని నువ్వెందుకనుకోవో నా కర్థము కావటములేదు." అన్నాను అతనికేసి చూస్తూ.

మూర్తి ఏమి మాట్లాడలేదు.

"నువ్వు శకుంతలను ప్రేమించావు వివాహము చేసుకోవాలనుకున్నావు అందుకనీ కుటుంబ పరిస్థితులు అడ్డంకమయ్యాయి. పరిస్థితులకు తలఒగ్గి ఈమెను వివాహము చేసుకున్నావు. వివాహమయిన తర్వాత భార్యగా ఆమెని సుఖపెట్టటము భర్తగా నీ కర్తవ్యము. జరిగిపోయినదానిని దృష్టిలో ఉంచుకుని అనవసరంగా ఆమెని బాధపెట్టి నువ్వుబాధపడటము మూర్ఖత్వమే అవుతుంది. ఒక స్నేహితుడిగా అదే నీకు చెప్పేది" అన్నాను.